

రౌడీలను భాషాపరంగా విభజిస్తారా?



- వ్యక్తి ప్రవర్తనలోకి భాషను తీసుకురావడమేంటి?
- 'తెలుగు' ప్రస్తావన ఎందుకు?
- ఆ వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకోండి
- కమిషనర్ వ్యాఖ్యలపై ఏఐటీఎఫ్ ఆగ్రహం

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులు రౌడీలతో వారికి అర్థమయ్యే భాషలో మాట్లాడాల్సి వుంటుంది. ఉదాహరణకు చాలా మంది రౌడీలు తెలుగు మాట్లాడతారనుకోండి. పోలీసులు ఆ భాషలోనే మాట్లాడుతూ కమ్యూనికేట్ చేయాల్సి వుంటుంది' అంటూ చెన్నై పోలీసు కమిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది పి.విల్సన్ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ముందు చేసిన వ్యాఖ్యలను అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. తక్షణం ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐటీఎఫ్ వ్యవస్థాపకుడు ఆచార్య సీఎంకే రెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. మానవ హక్కుల కమిషన్ ముందు ఓ కేసు వాదనల సందర్భంగా గురువారం పైన పేర్కొన్న వ్యాఖ్యలు న్యాయవాది పి.విల్సన్ చేశారంటూ ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీనిపట్ల సీఎంకే రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒక వ్యక్తి ప్రవర్తనలోకి భాషను తీసుకురావడం అనాలోచితమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాదిగా పోలీసులకు పట్టుబడిన రౌడీల వివరాలను భాషల వారీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఏ భాషకు చెందిన రౌడీలు ఎంతమంది వున్నారో అందరికీ తెలిసొస్తుందన్నారు. రౌడీల గురించి వివరిస్తూ తెలుగును ప్రస్తావించడాన్ని వారు ఎలా సమర్థించుకుంటారని నిలదీశారు.ఇప్పటికైనా వారు తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీఎంకే రెడ్డి డిమాండ్ చేశారు.

సముద్రం గీసిన చిత్రం

చెన్నైలోని ఈసీఆర్ రోడ్డు సమీపంలో వున్న పాలవాక్కం, కొట్టివాక్కం, తిరువాన్మియూర్, నీలాంగరై తదితర సముద్రతీర ప్రాంతాల్లోని అలలు నీలి రంగులోకి మారి ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. విల్లుపురం జిల్లా మరక్కాణంలో కూడా సముద్రపు నీరు నీలి రంగులో కనిపించింది. ఒక రకమైన బాక్టీరియా, సముద్రపు జీవులు మృతి చెందిన సమయాల్లో ఏర్పడే బయోలుమినిసెన్స్ కారణంగా సముద్రపు నీరు నీలి రంగులోకి మారినట్టు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.


- పెరంబూర్, ఆంధ్రజ్యోతి



చెరకు రైతులకు తీపి కబురు!

టన్నుకు రూ.215 అదనపు ప్రోత్సాహకం

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురందించింది. టన్నుకు అదనంగా రూ.215 ప్రోత్సాహక నిధిని అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శనివారం జీవో విడుదల చేసింది. చెరకు పండిస్తున్న రైతులపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం, సాగును పెంచాలన్న ఉద్దేశంతో షుగర్ ఫ్యాక్టరీల పనితీరు పెంపొందింపజేసి ఆర్థికంగా నలుగుతున్న ఫ్యాక్టరీలకు అండగా నిలవడమే కాకుండా పలు చర్యలు చేపడుతూ వస్తోంది. అందులో భాగంగా చెరకు రైతులకు యేటా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ప్రోత్సాహక నిధి కంటే అధికంగా నిధిని ప్రకటిస్తూ వస్తోంది. ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు వ్యవసాయశాఖ మంత్రి, 2024-25వ సంవత్సర వ్యవసాయ బడ్జెట్‌లో 2023-24వ కటింగ్ కాలంలో షుగర్ ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేస్తున్న రైతులకు టన్నుకు రూ.215 ప్రోత్సాహక నిధిగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్రప్రభుత్వం గత ఏడాది కటింగ్ సీజన్‌లో ప్రకటించిన ఆధార ధర రూ.2,919.75 కంటే అదనంగా రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహక నిధి అందజేసేందుకు అనుకూలంగా రూ.247 కోట్ల నిధులు కేటాయించింది. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రాష్ట్రంలో ఉన్న రెండు ప్రజారంగ, 12 సహకార, 16 ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీలకు 2023-24 కటింగ్ సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు కేంద్రం నిర్ణయించిన ఆధార ధర కంటే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ప్రకటించింది. ఈ ప్రకటన వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మందికి పైగా చెరకు రైతులు లబ్ధి పొందుతారని ప్రభుత్వం తన ప్రకటనలో తెలిపింది.



అహంకారంతో విర్రవీగొద్దు

ఇదే పద్ధతి కొనసాగితే ఆలయకీర్తి పతనమే

చిదంబరం దీక్షితార్లపై హైకోర్టు ఆగ్రహం



చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిదంబరంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నటరాజస్వామి ఆలయ దీక్షితార్లు అహంకారంతో విర్రవీగుతున్నారని, దేవుడి కంటే తామే గొప్పవారమనే భావనతో ప్రవర్తిస్తూ భక్తులను హీనంగా చూస్తున్నారని మద్రాసు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చిదంబరం నటరాజ స్వామి ఆలయంలో ఓ నర్సుపై దాడి చేసి అక్రమాలకు పాల్పడ్డారని, కనకసభపై భక్తులను దర్శనానికి అనుమతించాడని ఆరోపిస్తూ నటరాజ దీక్షితార్‌ను ఆ ఆలయ దీక్షితార్ల సంఘం సస్పెండ్ చేసింది. ఆ సస్పెన్షన్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ నటరాజ దీక్షితార్ దేవాదాయ కమిషనర్ వద్ద అప్పీలు చేసుకున్నారు. దీనిపై విచారణ జరిపిన కడలూరు డిప్యూటీ కమిషనర్ దీక్షితార్ల సంఘం నటరాజ దీక్షితార్‌ను సస్పెండ్ చేస్తూ వెలువరించిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దీక్షితార్ల సంఘం కార్యదర్శి వెంకటేశ దీక్షితార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు దీక్షితార్ల సంఘం తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. దీక్షితార్ల సంఘం తీసుకునే నిర్ణయాలలో జోక్యం చేసుకునే అధికారం రాష్ట్ర దేవాదాయ శాఖకు లేదని, దేవాదాయ శాఖ కడలూరు డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన సస్పెన్షన్ రద్దు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇక నటరాజ దీక్షితార్ తరఫున హాజరైన న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ కొన్ని దశాబ్దాలకు ముందు సుప్రీంకోర్టు దీక్షితార్లకు సానుకూలంగా తీర్పు వెలువరించినప్పటి నుంచి చిదంబరం నటరాజస్వామివారి ఆలయం తమ సొంతమనే భావనతోనే వ్యవహరిస్తున్నారని, న్యాయస్థానం జోక్యం చేసుకుని వారిని అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కోరారు. ఇరుపక్షాల వాద ప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి ఎం.దండపాణి చిదంబరం ఆలయ దీక్షితార్ల నుంచి తనకు కూడా చేదు అనుభవాలు ఎదురయ్యాయని, మానసికపరమైన కష్టాలతో ఆ ఆలయానికి వెళ్లేవారు పలు అవమానాలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. దీక్షితార్లందరూ అహంకారంతో విర్రవీగుతున్నారని, ఇది మంచి పద్ధతికాదన్నారు. చిదంబరం ఆలయానికి వచ్చే భక్తులందరినీ తమపై దండయాత్రకు పాల్పడేందుకు వస్తున్నారనే భావనతో వారి వద్ద దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఆలయం తమకు సొంతమైనదనే భావనతోనే దీక్షితార్లు ప్రవర్తిస్తున్నారని, ఆలయంలోని భగవంతుడికంటే తామే గొప్పవారమనే అహంకారం వారిలో కొట్టొచ్చినట్లు కనబడుతోందన్నారు. ఒకప్పుడు చిదంబరం ఆలయానికి పరిమితమైన ఆరుద్ర దర్శనం ఉత్సవాలు, ప్రస్తుతం అన్ని శివాలయాలలోనూ జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం చిదంబరం ఆలయం వద్ద జరిగే ఆరుద్రదర్శనం వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే భక్తుల రాక బాగా తగ్గి ఆలయ కీర్తి ప్రతిష్ఠలు కూడా పతనస్థితికి చేరుకుని మూతపడటం ఖాయమన్నారు. చిదంబరం ఆలయంలో చిల్లర వేస్తేనే పూలు ఇస్తార ని, లేకుంటే విభూది కూడా ఇవ్వరని న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయమూర్తి దం డపాణి దేవాదాయ శాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

గవర్నర్‌ను వెంటనే రీకాల్ చేయాలి

- డిప్యూటీ సీఎం ఉదయనిధి

అడయార్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమైక్యతకు భంగం కలిగించేలా, తమిళ తాయి గేయంలో కొన్ని పంక్తులను ఉద్దేశపూర్వకంగా తొలగించి కోట్లాది తమిళ ప్రజల మనస్సులను గాయపరిచిన గవర్నర్ ఆర్ఎన్.రవిని తక్షణం రీకాల్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. 'తమిళ తాయ్' గేయం రూపకల్పన సమయంలో కొన్ని పంక్తులు కొన్ని వర్గాల ప్రజల మనోభావాలను గాయపరిచే విధంగా ఉన్నాయని గుర్తించిన దివంత కలైంజర్ కరుణానిధి.. వాటిని తొలగించారు. కానీ, డీడీ తమిళ్ ఆధ్వర్యంలో జరిగిన హిందీ మాసోత్సవంలో పాల్గొన్న గవర్నర్ ... తమిళ తాయి గేయంలో ఏకంగా 'ద్రావిడ నల్‌తిరునాడు' అనే పదాలనే తొలగించి ఆలపించారు. ఏ ఒక్కరినీ మనోభావాలను గాయపరచరాదన్నది ద్రవిడం. ఇతరుల మనసులను గాయపరచి సంతోషపడటం ఆర్య సంస్కృతి. దీనికి ఓ మంచి ఉదాహరణే గవర్నర్ చర్య. దువ్వెన దాచిపెట్టినంత మాత్రాన వివాహం ఆగిపోదు. కొన్ని పంక్తులను తొలగించడం వల్ల ద్రావిడం పడిపోదు. ఆర్యులు దీన్ని అర్థం చేసుకోలేరు. అన్నా మార్గంలో పయనిస్తున్న మన నేత ఎంకే స్టాలిన్‌కు గౌరవ మర్యాదలు, పరువు గురించి ఇతరులు పాఠం చెప్పాల్సిన పనిలేదు. సమైక్యతకు విచ్ఛిన్నం కలిగించేలా నడుచుకుంటున్న గవర్నర్‌ను తక్షణం కేంద్రం రీకాల్ చేయాలి' అని ఉదయనిధిస్టాలిన్ డిమాండ్ చేశారు.

- తమిళ తల్లి ప్రార్థన గీతం...

తప్పుగా పాడిన మహిళల విచారణ

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ దూరదర్శన్ కేంద్రం (డీడీ పొదిగై)లో శుక్రవారం మధ్యాహ్నం గవర్నర్ రవి సమక్షంలో నిర్వహించిన హిందీ మాసోత్సవం సందర్భంగా తమిళ తల్లి ప్రార్థన గీతాన్ని తప్పుగా పాడిన మహిళలను ఆ కేంద్ర ఉన్నతాధికారులు విచారించారు. గవర్నర్ ఆదేశం మేరకు ఆ మహిళలను శనివారం ఉదయం విచారించినట్లు పేర్కొన్నారు. దూరదర్శన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో సంగీత నాటక విభాగానికి చెందిన సీనియర్ ఉద్యోగి తమిళ తల్లి ప్రార్థనగీతం పాడటం ఆనవాయితీ. శనివారం కార్యక్రమంలో ప్రార్థన పాడేందుకు ఆ మహిళను పిలువలేదు. ఆమెకు బదులుగా దూరదర్శన్ కార్యక్రమాల రూపకల్పన విభాగంలో ఉన్న నలుగురు మహిళా ఉద్యోగుల చేత ఆ గీతాన్ని పాడించారు. వారిలో ఇద్దరు మహిళలు మూడో వాక్యాన్ని పాడకపోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ఇద్దరు మహిళలు ఆ మూడో వాక్యాన్ని పాడకపోవడంతో తక్కిన ఇద్దరు మహిళలు కూడా వాళ్లతో కలిసి తక్కిన వాక్యాలను పాడుతూ వెళ్లారు. ఈ వ్యవహారంలో ఆ గీతంలోని మూడో వాక్యాన్ని ఇద్దరు మహిళలు పాడక పోవడానికి గల కారణాలను కనుగొనే దిశగా అధికారులు వారి వద్ద విచారణ జరుపుతున్నారు.

ఎందుకు మౌనం?

తమిళ తల్లిప్రార్థన గీతంలో తప్పిదం జరిగిందని తెలిసి కూడా ఎందుకు మౌనం పాటించారో బదులివ్వాలంటూ సీఎం స్టాలిన్ గవర్నర్ రవిపై ప్రశ్నల వర్షం కురిపించారు. తమిళ తల్లి ప్రార్థన గీతాన్ని తప్పులు దొర్లకుండా భక్తి శ్రద్ధలతో పాడగలనని గవర్నర్ జారీ చేసిన ప్రకటనపై స్టాలిన్ స్పందిస్తూ శుక్రవారం అర్ధరాత్రి పలు ప్రశ్నలతో ఓ ప్రకటన వెలువరించారు. ఆ ప్రకటనలో తమిళ తల్లి ప్రార్థన గీతాన్ని తప్పులు లేకుండా పాడగలిగినప్పుడు ఈ గీతాలాపనలో ఓ వాక్యం విడిచిపెట్టినా ఎందుకు మిన్నకుండిపోయారో బదులివ్వాలని డిమాండ్ చేశారు. గవర్నర్ గనుక వెంటనే లేచి ప్రార్థన గీతాన్ని సక్రమంగా పాడాలని ఆదేశించి ఉండాల్సిందన్నారు. జాత్యహంకార ధోరణితో గవర్నర్‌పై విమర్శలు చేయలేదని, తమిళమే తమ జాతి అని, ఆ తమిళం కోసం ప్రాణ త్యాగానికి కూడా సిద్ధమేనని, హిందీ వ్యతిరేకోద్యమంలో ప్రాణత్యాగం జరిగిన పుణ్యభూమి కూడా తమిళ సీమేనని గవర్నర్ తెలుసుకోవాలన్నారు. ఈ సీమలోని మాతృభాష పరిరక్షించడాన్ని గవర్నర్ జాత్యహంకారంగా భావిస్తే అది తమకు గౌరవమే అవుతుందన్నారు. తమిళభాషను తలపైకెత్తుకుని ప్రధాని మోదీ ప్రపంచ దేశాల్లో ఆ భాష ఔన్నత్యాన్ని చాటుతున్నారంటూ గొప్పలు చెబుతున్న గవర్నర్‌కు ఆ భాషాభివృద్ధికి స్వల్ప పరిమాణంలోనే నిధులు కేటాయిస్తున్నారనే విషయం తెలియకపోవడం గర్హనీయమన్నారు. ఢిల్లీలోని సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.2029 కోట్లు, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.406 కోట్లు కేటాయించిన మోదీ ప్రభుత్వం తమిళభాషాభివృద్ధికి రూ.167 కోట్లే కేటాయించిందన్నారు. ఇది సంస్కృత భాషాభివృద్ధి కేటాయించిన మొత్తంలో ఏడు శాతం మాత్రమేనని తెలిపారు. తానే తమిళ భాషా ప్రియుడినని గొప్పలు చెప్పుకుంటున్న గవర్నర్ ఆరంభంలో తమిళనాడు అనే పేరునే బహిష్కరించి తమిళగం అని పిలవాలని ప్రజలపై ఒత్తిడి చేసిన విషయాన్ని ఎవరూ మరచిపోలేదన్నారు. తమిళభాషను ప్రేమిస్తున్నానని చెప్పుకునే గవర్నర్ తిరువళ్లువర్ చిత్రపటానికి కాషాయ రంగును ఎందుకు పులిమారో బదులివ్వాలన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి రాష్ట్రంలోని తమిళ ప్రజలకు, తమిళభాషకు, తమిళ సంస్కృతిని ద్వేషిస్తూ రోజు రాజకీయాలు మాట్లాడటం, రాజ్‌భవన్‌ను రాజకీయ కార్యాలయంగా మార్చేసిన ఘనత గవర్నర్ రవికే దక్కుతుందని స్టాలిన్ ఘాటుగా విమర్శించారు.

శాంతి భద్రతలకు సవాలుగా సోషల్ మీడియా వదంతులు



సదస్సుకు హాజరైన కేరళ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

దక్షిణాది డీజీపీల సదస్సులో సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతి భద్రతలను పటిష్ఠం చేయడంలో సోషల్ మీడియాలో వెలువడుతున్న తప్పుడు సమాచారాలు, వదంతులు పెనుసవాలుగా మారుతున్నాయని సీఎం స్టాలిన్ అన్నారు. చెన్నైలో శనివారం ఉదయం జరిగిన దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమన్వయ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల రాష్ట్రంలో శాంతి భద్రతలకు పెనుముప్పు కలిగించే స్థాయిలో ఓ వదంతిని వ్యాపింపజేశారని, ఆరంభంలోనే దాన్ని వట్టిదేనని నిరూపించగలగటంతో గండం నుండి బయటపడ్డామన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉంటూ ఇలాంటి వదంతులు పుట్టించిన వారిని గాలించి అరెస్టు చేసి జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేయగలిగామన్నారు.
ఇటీవల ఓ యూట్యూబర్‌కు సంబంధించిన కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు... తమిళనాడు శాంతియుతమైన రాష్ట్రమని అక్కడ శాంతికి విఘాతం కలిగించే వదంతులు ఎలా పుట్టిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు.

రాష్ట్రాల సహకారం అవసరం...

శాంతి భద్రతలను పరిరక్షించడానికి పొరుగు రాష్ట్రాల సహాయ సహకారాలు అవసరమని స్టాలిన్ చెప్పారు. నిషేధిత పొగాకు వస్తువుల అమ్మకం, గంజాయి అక్రమరవాణా నిరోధించడంలో రాష్ట్రాల నడుమ సమన్వయం ఉండాలన్నారు. ఇటీవల కేరళ ఏటీఎంలలో దోపిడీలకు పాల్పడి పరారవుతున్న ముఠాను ఆ రాష్ట్ర పోలీసులందించిన సమాచారం ఆధారంగా తమ రాష్ట్ర పోలీసులు సకాలంలో అరెస్టు చేశారని చెప్పారు. అలా అరెస్టయిన ఏటీఎం దోపిడీ ముఠా సభ్యులు తమ రాష్ట్రంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలుసుకుని వారిని కఠినంగా శిక్షించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర డీజీపీ శంకర్‌జివాల్, హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, కేరళ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్, కర్ణాటక డీజీపీ అలోక్‌మోహన్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమల రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

'తమిళం' విశ్వవ్యాప్తికి ప్రధాని యత్నం

- కేంద్రమంత్రి ఎల్ మురుగన్



అడయార్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళ భాష పరిరక్షణకు, తమిళాన్ని విశ్వవ్యాప్తి చేయడంలో ప్రధాని నరేంద్రమోదీ ముందుంటారని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. నగరంలో డీడీ తమిళ్‌లో హిందీ మాసోత్సవాల్లో గవర్నర్ ఆర్ఎన్.రవి పాల్గొన్న సందర్భంగా తమిళ తాయి గేయంలో కొన్ని పంక్తులు తొలగించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వివాదంపై కేంద్రమంత్రి స్పందించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమిళ తాయ్ గేయం అంశం పూర్తిగా ప్రజల దృష్టిని మరల్చే చర్యగా అభివర్ణించారు. అన్ని కేంద్రప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ మాసోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ తరహా మాసోత్సవాలను నిర్వహించారని గుర్తు చేశారు. తిరుక్కురళ్‌కు ప్రపంచ వ్యాప్తంగా కల్చరల్ సెంటర్ నెలకొల్పాలని భావించి, దానిని ప్రధాని అమలు చేస్తున్నారన్నారు. ఐకరాజ్య సమితిలో ప్రసంగించే సమయంలోనూ 'యాదుం ఊరే.. యావరుం కేళిర్' అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టి, తమిళ ప్రజలందరికీ గౌరవం చేకూర్చారన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ఆరోపణలు చౌకబారువన్నారు. దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇండియా కూటమి నేతలు చేసే కుట్ర అని ఆరోపించారు. ఉదయమే కాంగ్రెస్ నేత ఒకరు ట్వీట్ చేస్తారు. ఆ తర్వాత డీఎంకే, కాంగ్రెస్ నేతలు లేఖలు రాస్తారన్నారు. ఆ తర్వాత ఒక చిన్నపాటి ధర్నా చేస్తారన్నారు. తద్వారా లబ్ధి చేకూరుతుందా అని చూస్తారన్నారు. డీడీ తమిళ్ కార్యక్రమంలో పొరపాటు చేసిన వారే క్షమాపణలు కోరారని చెప్పారు. కానీ, ఈ అంశంలో గవర్నర్‌కు సంబంధం ఉన్నట్టుగా పేర్కొనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఒక చిన్న తప్పు జరిగితే దానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ ఎలా బాధ్యత వహిస్తారన్నారు. ఇది 1960 నాటి కాలం కాదని, డీఎంకే భావించే రాజకీయాలు ఇపుడు ఫలించవన్నారు. హిందీకి మద్దతుదారులు కాదు.. అదేసమయంలో వ్యతిరేకులం కూడా కాదన్నారు. హిందీని తీవ్రంగా వ్యతిరేకించే డీఎంకే నేతలు తమకు చెందిన సీబీఎస్ఈ పాఠశాలలను మూసివేసేందుకు సిద్ధంగా లేరన్నారు. ఎందుకంటే ఆ పాఠశాలల ద్వారా ఆదాయం వస్తుందన్నారు. అధికార, ధర్మబద్ధమైన రాజకీయాలు చేయండి, టాస్మాక్ దుకాణాలను మూసివేయండని కోరారు. చెన్నై నగరంలోని కూవం, అడయారు కాలువలను సరి చేయనంతవరకు చెన్నై నగరానికి వరద ముప్పు తొలగదని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు.

సమాచార దర్శిని

మెరీనా స్విమ్మింగ్ పూల్ ఆన్‌లైన్ బుకింగ్

పెరంబూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో ఉన్న కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌ను రూ.1.37 కోట్లతో ఆధునికీకరించారు. స్విమ్మింగ్ పూల్ ఉదయం 5.30 నుంచి రాత్రి 7.30 గంటలకు పనిచేస్తుండగా, ఉదయం 8.30 నుంచి 9.30 గంటలకు మహిళలకు సమయం కేటాయించారు. స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు 14 ఏళ్ల పైబడిన వారికి గంటకు రూ.50, 12-14 ఏళ్లున్న వారికి రూ.30గా నిర్ణయించారు. స్లాట్లను https://chennaicorporation.gov.in/gcc/లో బుకింగ్ చేసుకోవచ్చు. అలాగే, ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొనేవారికి రూ.50కు బదులుగా రూ.45, రూ.30కి బదులుగా రూ.25 అని ఐదు రూపాలయ రాయితీ కల్పించారు. ప్రతి సోమవారం స్విమ్మింగ్ పూల్‌కు సెలవు అని కార్పొరేషన్ తెలిపింది.

12వరకు వేళచ్చేరి శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలం 172వ వార్డు వేళచ్చేరి గురునానక్ కళాశాల సమీపంలోని వేళచ్చేరి హిందూ శ్మశానవాటికలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా నవంబరు 12వతేది వరకు మూసివేయనున్నారు. అప్పటి వరకు ప్రజలు ఆలందూర్ మండలంలోని బాలకృష్ణాపురం దహనవాటిక, పెరుంగుడి మండలంలోని పుళుదివాక్కం దహనవాటిక, 178వ వార్డు వేళచ్చేరి తరమణి రోడ్డులోని భారతి నగర్ దహనవాటికలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ సూచించింది.

కలైంజర్ సెంటినరీ పార్కు ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్థానిక కెథడ్రల్ రోడ్డులో ఉన్న కలైంజర్ సెంటినరీ పార్కును భారీ వర్షసూచన కారణంగా ఈనెల 15వ తేది నుంచి శుక్రవారం వరకు మూసివేశారు. ఈ పార్కు శనివారం నుంచి యధావిధిగా పనిచేయనుంది. పార్క్‌లో రద్దీ నియంత్రించేలా ప్రజలు https://tnhorticulture.in/ kcpetickets లో ముందుగానే ప్రవేశ టిక్కెట్లు పొందవచ్చు. అందులో పక్షుల పార్కు, జిప్ లైన్ తదితరాలకు సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ప్రవేశ టిక్కెట్లు ఇస్తారు. మ్యూజిక్ ఫౌంటైన్‌కు రోజుకు 320 ప్రవేశ టిక్కెట్లు మాత్రమే అందజేయనున్నారు.పార్కు కౌంటర్ల వద్ద సాయంత్రం 6గంటలవరకు టిక్కెట్లు పొందవచ్చు.

నాలుగు రోజుల్లో 5,949 వైద్యశిబిరాలు

పెరంబూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు రోజుల్లో 5,949 వైద్యశిబిరాలు నిర్వహించి 3.53 లక్షల మందికి వైద్య పరీక్షలు, చికిత్సలు అందజేసినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. ఈశాన్య రుతుపవనాల సందర్భంగా ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ఈ నెల 15న 1,293 ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన ప్రాంతాలు, నీరు నిలిచిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో 3,53,862 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 2,389 మందికి జ్వరం, 17,855 మందికి దగ్గు, చలి లక్షణాలున్నట్లు నిర్ధరించి వైద్య చికిత్సలు అందించినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

పాములు పట్టేందుకు ఇరుళర్ సొసైటీకి అనుమతి

పెరంబూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): విషపూరిత పాములు పట్టేందుకు తిరువణ్ణామలై ఇరుళర్ కో-ఆపరేటివ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. పాము కాటుకు గురైన బాధితులకు విషం విరుగుడు మందులు వినియోగిస్తుంటారు. పాము విషయం మూలపదార్థంగా ఈ మందులు తయారవుతున్నాయి. ఈ నేపథ్యంలో, తిరువణ్ణామలై ఇరుళర్ కో-ఆపరేటివ్ సంఘం 2024-25 నుంచి 2026-27 వరకు ఏడాదికి 1,000 కట్లపాములు, 500 తాచుపాములు అని 4,500 పట్టుకొనేందుకు అనుమతించారు. అందులో తాచుపాముకు తలా రూ.150, కట్లపాముకు తలా రూ.100 లైసెన్స్ ఫీజుగా వసూలు చేయనున్నారు.

అప్రెంటీస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో అప్రెంటీస్ శిక్షణకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 21వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. 2020, 21, 22, 23, 24 సంవత్సరాల్లో ఇంజనీరింగ్ శాఖలో మెకానికల్, ఆటోమొబైల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ ఈసీఈ తదితర విభాగాల్లో డిప్లొమా, డిగ్రీలు పూర్తిచేసిన 341 మంది, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర నాన్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తిచేసిన 158 మంది అని మొత్తం 499 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. డిగ్రీ పూర్తిచేసిన వారికి నెలకు రూ.9 వేలు, డిప్లొమా చేసిన వారికి రూ.8 వేలు ప్రోత్సాహక వేతనం అందిస్తారు. ఆసక్తి కలిగిన వారు www.boatsrp.com లో ఈనెల 21వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణకు ఎంపిక వారి వివరాలు 28వ తేది వెబ్‌సైట్‌లో విడుదల చేసి, నవంబరు 13,14,15 తేదీల్లో సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని అధికారులు తెలిపారు.

కోవై అన్నా వర్శిటీలో రూ.90 లక్షలతో రీసెర్చ్ పార్కు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో రీసెర్చి పార్కు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు. అన్నా వర్శిటీ క్యాంపస్‌లోని టిడ్కో బయోటెక్నాలజీ పార్క్‌లో రీసెర్చి పార్కు ఏర్పాటు కానుంది. ఈ పార్కు ఏర్పాటుకు రూ.90 లక్షలు కేటాయించగా, తమిళనాడు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది.

దీపావళి పండుగ సందర్భంగా 40 ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా 40 ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. దీపావళి పండుగను సొంతూళ్లలో జరుపుకొనేందుకు వెళ్లే ప్రజలు అధికంగా రైళ్లలో ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం డెల్టా, ఇతర నగరాలకు వెళ్లే రైళ్ల రిజర్వేషన్ పూర్తికాగా, వెయిటింగ్ లిస్ట్ ఉంది. దీంతో, ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి ఈనెల 29, నవంబరు 5వ తేది నాగర్‌కోయిల్, ఈనెల 29, నవంబరు 2వ తేది కోయంబత్తూర్, ఈనెల 30, నవంబరు 6వ తేది తిరునల్వేలికి, చెన్నై ఎగ్మూర్ నుంచి ఈనెల 30, నవంబరు 2వ తేది సెంగోట్టైకు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. అలాగే, చెన్నై సెంట్రల్ నుంచి మంగళూరుకు నవంబరు 2వ తేది, కొచ్చువెల్లి-బెంగళూరు మధ్య నవంబరు 4, నాగర్‌కోయిల్-మైసూరు మధ్య నవంబరు 2వ తేది ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఇక, చెన్నై, ఎర్నాకుళం నుంచి ఢిల్లీ, అహమ్మదాబాద్‌కు నవంబరు 13వ తేది వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు, ఈ ప్రత్యేక రైళ్లకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంతమొత్తుకున్నా ఈ రాష్ట్రంలో రాజకీయం, ఆధ్యాత్మికం వేర్వేరే!

● తమిళిసైకి డిప్యూటీ సీఎం ఉదయనిధి కౌంటర్

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు కలిగించే ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళితే మాజీ గవర్నర్ తమిళిసై తనను యెద్దేవా చేయడం గర్హనీయమని డిప్యూటీ సీఎం ఉదయనిధి కౌంటర్ ఇచ్చారు. తమిళభాషకు, తమిళ ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న గవర్నర్‌ను విమర్శిస్తే మాజీ గవర్నర్ అక్కయ్యకు ఆగ్రహం పుట్టుకొస్తోందన్నారు. శనివారం తిరువణ్ణామలైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మతం పేరిట, ఆధ్యాతికం పేరిట జరుగుతున్న మోసాలు ఎండగడితే మాజీ గవర్నర్ అక్కయ్యకు కోపం వస్తోందని, అందరికీ అన్ని సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అదే విధంగా ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం కూడా ఆలయాలన్నింటికీ కుంభాభిషేకాలు జరిపిస్తోందన్నారు.

బ్లూ రంగు లగ్జరీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో కొత్తగా ప్రారంభించిన 130 లగ్జరీ ఎంటీసీ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ముఖ్యమంత్రిగా ఎంకే స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే సాధారణ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేశారు. చెన్నైలో 1,559 బస్సులతో పాటు పలు నగరాల్లో 7,300 సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంటీసీ తాజాగా బ్లూ లగ్జరీ బస్సులను ప్రారంభించింది. 'మగళిర్ విడియల్ పయనం' అనే పేరుతో నడిచే ఈ బస్సుల్లో తొలుత లగ్జరీ ఛార్జీ వసూలు చేశారు. ప్రస్తుతం సాధారణ ఛార్జీ వసూలు చేస్తుండగా ఇకపై ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు.


విమానాశ్రయ మెట్రోకు 2వ పార్కింగ్ వసతి

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) స్థానిక విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. ఈ ప్రాంతానికి వచ్చే మెట్రోరైళ్లలో కూడా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటోంది. ప్రయాణికులు తమ వాహనాలు పార్కింగ్ చేసేలా ఏర్పాటు చేసిన పార్కింగ్ ఉదయం 10 గంటలకు ఫుల్ కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వారి సౌకర్యార్థం మెట్రో రైల్వేస్టేషన్ నుంచి కిమీ దూరంలో రూ.45 లక్షలతో రెండో పార్కింగ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో 54 నాలుగు చక్రాల వాహనాలు, 300 ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకొనే వసతి ఉంది. వచ్చే నెలలో ఈ పార్కింగ్ అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు.

రూ.650 కోట్లతో కొత్త కాలువలు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లికరనై, మడిపాక్కం ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లేలా రూ.650 కోట్లతో కొత్త కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని పెరుంగుడి మండలం మడిపాక్కం, పుళిదతివాక్కం, ఉల్లాగరం ప్రాంతాలు వర్షాల సమయంలో ముంపుకు గురవుతున్నాయి. దీన్ని అడ్డుకొనేలా కార్పొరేషన్, నీటిపారుదల, ప్రజాపనులు, రహదారుల శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. కోవిలంబాక్కం, నన్మంగళం ప్రాంతాలు ప్రస్తుత వర్షాలతో ఎలాంటి ముంపుకు గురికాలేదు. వేళచ్చేరి ప్రాంతంలో రైల్వేకు సొంతమైన ప్రాంతంలో ఆరు కాలువలు ఏర్పాటుతో వర్షపు నీరు సాఫీగా వెళుతోంది. తదుపరి చర్యల్లో భాగంగా పెరుంగుడి, షోళింగనల్లూర్ మండలాల్లో రూ.650 కోట్లతో వర్షపు కాలువల నిర్మాణపనులు చేపట్టనున్నామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయికి వీరాణం జలాశయం



వీరాణం చెరువును పరిశీలిస్తున్న మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కాట్టు మన్నార్ కోయిల్ సమీపంలోని వీరాణం జలాశయం మూడో సారిగా పూర్తిస్థాయికి చేరుకుంది. ఈ జలాశయం పూర్తిసామర్థ్యం 47.50 అడుగులు కాగా, శనివారం ఉదయం పూర్తిస్థాయికి చేరింది. శనివారం ఉదయం మంత్రి ఎమ్మార్కే పన్నీర్ సెల్వం ఆ జలాశయాన్ని పరిశీలించారు. జలాశయం భద్రత దృష్ట్యా 300 ఘనపుటడుగులు దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే, చెన్నై నగరవాసుల తాగునీటి అవసరాలకు 65 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయికి చేరుకోవడంతో కీళనై డ్యాం నుంచి విడుదల చేస్తున్న జలాలను నిలిపివేసినట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

కాట్పాడి డివిజన్‌లో కలెక్టర్ తనిఖీలు



కలైంజర్ ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ సుబ్బులక్ష్మి శనివారం పరిశీలించారు. కాట్పాడి పంచాయతీలో కలైంజర్ కనవు ఇల్లం పథకంలో నిర్మిస్తున్న ఇళ్లు, వండ్రన్‌తాంగళ్ చెరువులో పూడికతీత పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ జానకి, వేలూరు సబ్ కలెక్టర్ బాలసుబ్రమణ్యన్, గ్రామీణాభివృద్ధి పథక ఇంజనీర్ శ్రీనివాసన్, కాట్పాడి తహసీల్దార్ భగదీశ్వరన్, కాట్పాడి బీడీఓ నందకుమార్, కనకరాజ్ తదితరులున్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి డివిజన్ పొన్నై ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ హాజరయ్యారు. పొన్నై ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు 122 మంది, పొన్నై ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 102 మందికి సైకిళ్లు అందజేశారు. అనంతరం ఎరుకల్‌బట్టులో రూ.31.46 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి దురైమురుగన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమరన్,పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ, కాట్పాడి పంచాయతీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, వేలూరుకార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్, పంచాయతీ అధ్యక్షులు శరవణన్, రవి, గోమతి, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి పాల్గొన్నారు.

ఏపీజే ట్రస్ట్ తరపున రూ.2 లక్షల విలువైన విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీజే ట్రస్ట్ తరపున ఆర్కాడులోని ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం 50 మంది పేద విద్యార్థులకు విద్యా సహాయ నిధులు, సామగ్రి అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు గోపి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్కాడు ఎమ్మెల్యే ఈశ్వరప్పన్ పాల్గొని, విద్యార్థులకు సుమారు రూ.2 లక్షల విలువైన విద్యా సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శరవణన్, ఉపాధ్యక్షుడు రాజశేఖరన్, పారిశ్రామికవేత్త నల్లస్వామి, రోటరీ సంఘ అధ్యక్షుడు భరత్‌కుమార్, ఆర్కాడు నగర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు బాస్కరన్, తిమిరి పంచాయతీ అధ్యక్షుడు రమేష్, ఆనైకట్టు సెక్రటరీ ప్రభు, అమ్మ ట్రస్ట్ అధ్యక్షుడు రేణుగోపాల్, భరతనాట్య సంఘ అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బేకరీల్లో పాచిపోయిన 8 వేల గుడ్లు స్వాధీనం



తనిఖీలు చేపట్టిన అధికారులు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తొన్నూర్ సమీపం ఆళ్వార్‌తోపు ప్రాంతంలోని బేకరీల్లో శుక్రవారం ఆహార భద్రతా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బేకరీలో కేక్ సహా పలు రకాల్లో వినియోగిస్తున్న కోడిగుడ్లు పాచిపోయినవిగా గుర్తించారు. సుమారు 8,000 గుడ్లు, వాటిని ఉపయోగించి తయారుచేసిన 215 కిలోల కేక్, బిస్కెట్ రకాలను అధికారులు స్వాధీనం చేసుకొని, రెండు బేకరీలకు సీలు వేశారు.

చిరుత దాడిలో ఆరేళ్ల బాలిక మృతి

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లాలో చిరుతపులి దాడిలో ఆరేళ్ల బాలిక మృతిచెందింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అన్సారీ కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపం ఊసిమలై ఎస్టేట్ ప్రాంతంలోని తేయాకు తోటలో పనిచేస్తున్నాడు. అన్సారీ కుమార్తె అప్సర (6) శనివారం మధ్యాహ్నం తల్లితో కలసి తేయాకు తోటలోకి వెళ్లింది. ఆ సమయంలో పొదల మాటు నుంచి వచ్చిన చిరుత బాలికను నోట కరుచుకొని పరుగెత్తింది. బాలిక తల్లి కేకలతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు చిరుత నుంచి బాలికను రక్షించాలని యత్నించేలోపు, చిరుత తేయాకు తోటలోకి పరుగులు తీసింది. అందరూ ఆ ప్రాంతానికి చేరుకోవడంతో చిరుత బాలికకు వదిలి అడవిలోకి వెళ్లింది. చిరుత దాడిలో గొంతు, తలకు తీవ్రగాయాలైన అప్సర సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

కీల్పాక్కంలో అడ్డదిడ్డంగా వెళ్లిన కారు

ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు, కారు ఢీకొనడంతో ధ్వంసమైన ఆటో

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో అడ్డదిడ్డంగా వెళ్లిన కారు ఢీకొనడంతో పలు వాహనాలు నుజ్జునుజ్జుకాగా, ఐదుగురికి గాయాలయ్యాయి. పూందమల్లి హైరోడ్డు కీల్పాక్కం నుంచి సెంట్రల్ రైల్వేస్టేషన్ వైపునకు వెళుతున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి, రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళుతూ ఆటో, కారు, ద్విచక్రవాహనాలను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, చిన్నారి, ఆటో డ్రైవర్ సహా ఐదుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గాయపడిన వారిని రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు కారు డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పుదువైలో భారీ వర్షం

విద్యా సంస్థలకు సెలవు

పుదుచ్చేరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావం కారణంగా శనివారం ఉదయం పుదుచ్చేరిలో భారీ వర్షం కురిసింది. దీంతో ఆ రాష్ట్రంలోని పాఠశాలలు, కాలేజీలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. శుక్రవారం రాత్రి నుంచే ఆకాశంలో దట్టమైన మేఘాలు అలముకోగా, శనివారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం రెండు గంటల పాటు ఏక బిగువున కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈ కారణంగా విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

తమిళ సిద్ధాంతాలకు గవర్నర్ రవి వ్యతిరేకం

● కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళుల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహరిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. శివగంగ జిల్లా కారైక్కుడిలో శనివారం మీడియాతో మాట్లాడిన చిదంబరం.. రాష్ట్రంలో కొనసాగుతున్న ద్విభాషా విధానాన్ని గవర్నర్ అర్థం చేసుకోవాలన్నారు. తమిళుల సంప్రదాయాలు, అలవాట్లు గౌరవించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో త్రిభాషా విధానం అమలులో ఉందని చెప్పడం సరి కాదని, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో విద్యార్థులకు ఒక భాష మాత్రమే తెలుసని, అక్కడ ఆంగ్లం నేర్పించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి ద్విభాషా విధానాన్నే ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తప్పనిసరిగా పాటిస్తోందని, అదే సమయంలో ఇష్టపడిన వారు హిందీ మీడియంలో చదువుకోరాదని ఎన్నడూ చెప్పలేదని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాల్లో హిందీ మీడియంలో విద్యార్థులు చదువుకొనేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఈ విషయాన్ని గవర్నర్ క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని చిదంబరం సూచించారు.ఫోటో 8: స్కూలు ప్రారంభోత్సవ దృశ్యం

తిరువళ్లూరులో హార్ట్‌ఫుల్‌నెస్ స్కూల్ ప్రారంభం

అడయార్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులో హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ (హెచ్ఐఎస్)ను శుక్రవారం ప్రారంభించారు. తిరువళ్లూరు - తిరుత్తణి జాతీయ రహదారి, కొలుందలూరు రోడ్డు సమీపంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. గతంలో లాలాజీ మెమోరియల్ ఒమేగా ఇంటర్నేషనల్ స్కూల్‌గా ఉన్న ఈ పాఠశాల పేరును హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌గా పేరుమార్చారు. ఈ కార్యక్రమానికి శ్రీ రామచంద్ర మిషన్ ప్రెసిడెంట్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ గైడ్ కమలేష్ డి.పటేల్ (దాజి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరానికి ప్లేస్కూల్, కిండర్‌గార్టెన్ విభాగాల్లో మాత్రమే అడ్మిషన్లు కల్పించారు. ఆహ్లాదకరమైన పచ్చటి వాతావరణంలో 140 ఎకరాల విస్తీర్ణంలో స్కూల్ ఏర్పాటైంది. హైటెక్ క్లాస్‌రూమ్స్, స్పోర్ట్స్ విలేజ్, ప్లే స్టేషన్స్, లిటరసీ, న్యుమరసీ సెంటర్లు, యోగా, మ్యూజిక్, స్టోరీ టెల్లింగ్ స్పేసెస్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. తిరువళ్లూరులో హెచ్ఐఎస్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని కమలేష్ పటేల్ పేర్కొన్నారు.

ధనుష్ - ఐశ్వర్య విడాకుల కేసు మళ్లీ వాయిదా



అడయార్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హీరో ధనుష్, దర్శకురాలు ఐశ్వర్య రజనీకాంత్ విడాకుల కేసు మరోమారు వాయిదా పడింది. 2004లో ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా, వీరిమధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా పరస్పర ఆమోదంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుని, చెన్నై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తొలుత ఏప్రిల్ 15వ తేదీన విచారణకు రాగా, అక్టోబరు 7వ తేదీకి కోర్టు వాయిదా వేస్తూ, ధనుష్, ఐశ్వర్యలు స్వయంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. కానీ, ఈ నెల 7వ తేదీన వారిద్దరూ కోర్టుకు హాజరుకాలేదు. దీంతో 19వ తేదీకి వాయిదా వేయగా, రెండోసారి కూడా వారిద్దరు గైర్హాజరయ్యారు. దీంతో తదుపరి విచారణను నవంబరు 2వ తేదీకి చెన్నై ప్రిన్సిపల్ ఫ్యామిలీ వెల్ఫేర్ కోర్టు మేజిస్ట్రేట్ శుభాదేవి వాయిదా వేశారు. కాగా, వీరిద్దరిని మళ్లీ ఒక్కటి చేసేందుకు సూపర్‌స్టార్ రజనీకాంత్ కుటుంబానికి చెందిన అత్యంత సన్నిహితులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అందుకే వీరిద్దరూ కోర్టు విచారణకు హాజరుకావడం లేదనే ప్రచారం కోలీవుడ్‌లో సాగుతుంది.

నవంబర్ 28న గంగాధీశ్వరాలయ కుంభాభిషేకం



ఆలయ నిర్వాహకులతో చర్చలు జరుపుతున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పురుషవాక్కం గంగాధీశ్వరాలయ మహా కుంభాభిషేకం నవంబర్ 28న భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం ఆయన ఆలయ జీర్ణోద్ధరణ పనులను పరిశీలించారు. ముందుగా ప్యారీస్ కార్నర్ తంబుశెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయంలో కొయ్య రథానికి వెండిరేకులు పొందుపరిచే పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ వెండి రథానికి రూ.2.17 కోట్లు ఖర్చవుతుందని ఆయన చెప్పారు.

దీపావళి మరుసటి రోజు సెలవు

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను స్వస్థలాలకు వెళ్లి జరుపుకునేవారంతా సంతోషించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ఓ ఉత్తర్వు జారీ చేశారు. ఈ యేడాది దీపావళి ఈనెల 31 (గురువారం)న జరుపుకోనున్నారు. మరుసటి రోజు శుక్రవారం సెలవు పెడితే శని, ఆదివారాలు కూడా కలుపుకుని నాలుగు రోజులపాటు స్వస్థలంలో గడిపే వీలుంటుందని, కనుక నవంబర్ 1న సెలవు దినంగా ప్రకటించాలంటూ ఉద్యోగవర్గాల నుండి స్టాలిన్‌కు విజ్ఞప్తులందాయి. వాటిని పరిశీలించిన మీదట ఆయన నవంబర్ ఒకటోతేదీ ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఈ సెలవును భర్తీ చేసేలా ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాసంస్థలు నవంబర్ 9న పనిచేయాల్సి ఉంటుందని ఆయన ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

గవర్నర్ పాల్గొన్న స్నాతకోత్సవంలో తమిళ తల్లి ప్రార్థన

● మంత్రి గైర్హాజర్



విద్యార్థినికి పట్టా బహూకరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తంజావూరు తమిళ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొనగా, జిల్లాకు చెందిన సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ బహిష్కరించారు. ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి 43 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో, శనివారం 14వ స్నాతకోత్సవాలు నిర్వహించారు. ఉపకులపతి తిరువళ్లువన్ స్వాగతోపన్యాసం చేయగా, దిండుగల్ గాంధీ గ్రామ్ గ్రామీణ డీమ్డ్ యూనివర్శిటీ ఉప కులపతి పంచనాథం కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి ముఖ్యఅతిథిగా పాల్గొని, 100 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 76 మంది పరిశోధకులు సహా 658 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో రాష్ట్ర తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ పాల్గొనాల్సి ఉంది అయితే, చివరి నిమిషంలో ఆయన గైర్హాజరయ్యారు. శుక్రవారం గవర్నర్ పాల్గొన్న కార్యక్రమంలో తమిళ తల్లి ప్రార్థనను కించపరిచిన వ్యవహారం వివాదాస్పదం కావడంతో, మంత్రి పాల్గొనలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, తప్పులు దొర్లకుండా తమిళ తల్లి ప్రార్థనా గీతం ఆలపించడం గమనార్హం.

రోడ్డు ప్రమాదాల్లో ద్వితీయ స్థానంలో రాష్ట్రం

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సరాసరి 474 మంది మత్యువాత పడుతున్న నేపథ్యంలో, ఇందులో రాష్ట్రం ద్వితీయస్థానంలో నిలిచింది. దేశంలో వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, వాటికి అనుకూలమైన రోడ్డు వసతులు అందుబాటులో లేనందువల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. గత 2023-24లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 1.73 లక్షల మంది మృతిచెందారు. అదే సమయంలో ప్రమాదాల్లో చిక్కుకొని గాయపడుతున్న వారి జాబితాలో రాష్ట్రం ప్రథమస్థానంలో ఉంది. ఇక్కడ 72,292 మంది గాయాలపాలై అవయవాలు కోల్పోయినట్లు సర్వేలో వెల్లడైంది.

మెదడు నిర్జీవమైన యువకుడి అవయవదానం



మణివణ్ణన్

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా మేల్‌ముడియనూరుకు చెందిన మణివణ్ణన్ శ్రీపెరుంబుదూర్ జేపీఆర్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 11వ తేది మధ్యాహ్నం హనుమాన్ పాళ్యం వద్ద బైక్‌లో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని వెంటనే వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక 17వ తేది మెదడు నిర్జీవమైంది. తల్లిదండ్రుల అనుమతితో వైద్యులు ప్రత్యేక చికిత్స ద్వారా గుండె, లివర్, కిడ్నీలు, కళ్లను చెన్నై, వేలూరు ఆస్పత్రుల్లో అవసరమైన వారికి అమర్చేందుకు తరలించారు.

మొబైల్ యజమాని ఇంట్లో మూడో రోజు తనిఖీలు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మొబైల్స్, టీవీ సహా ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతుల్లో పన్నులు ఎగవేశారంటూ ఓ మొబైల్స్ సంస్థ యజమాని ఇంట్లో ఆదాయ పన్ను శాఖ చేపట్టిన తనిఖీలు మూడో రోజైన శనివారం కొనసాగాయి. కోడంబాక్కంలోని ఇల్లు, పల్లావరం, పల్లికరనైలోని ఆ సంస్థ ప్రధాన, శాఖ కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూలైమేడులో గుండెపోటుతో ఎట్టియప్పన్ (45) అనే హెడ్ కానిస్టేబుల్ శుక్రవారం అర్ధరాత్రి మరణించారు. పసుమ్‌పొన్ వీధిలో ఉన్న ఇంట్లో ఎట్టియప్పన్ రాత్రి 11 గంటల సమయంలో గుండె నొప్పితో తల్లడిల్లిపోవడం గమనించిన కుటుంబసభ్యులు అంబులెన్స్ ద్వారా అన్నానగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ ఆయనకు అవసరమైన చికిత్సలు అందించే వసతి లేదని వైద్యులు తెలియజేయడంతో అక్కడి నుంచి ఆళ్వార్‌పేటలో ఉన్న మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుండెపోటు కారణంగా ఎట్టియప్పన్ అప్పటికే మరణించనట్లు నిర్ధారించారు.

సాత్తాన్‌కుళం తండ్రి, కుమారుడి హత్య కేసు

ప్యారీస్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా సాత్తాన్‌కుళంలో తండ్రి, కుమారుడి హత్య కేసులో మళ్లీ విచారణ పేరుతో సాగదీయరాదని మదురై హైకోర్టు న్యాయమూర్తి ఇళంగోవన్ అభిప్రాయపడ్డారు. తండ్రి, కుమారుడు హత్య కేసులో అరెస్టయి మదురై సెంట్రల్ జైలులో ఉన్న కానిస్టేబుల్ రఘుగణేశ్ మదురై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సాత్తాన్‌కుళం తండ్రి, కుమా రుడు హత్య కేసువిచారణ తూత్తుకుడి న్యాయస్థానంలో జరుగుతోందని, న్యాయ శాఖ ప్రతినిధి శక్తివేల్‌ను ఈ కేసులో 36వ సాక్షిగా చేర్చారని, తన తరపున శక్తివేల్‌ను క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు అనుమతించాలంటూ కోరారు.ఈ పిటిషన్ న్యాయమూర్తి ఇళంగోవన్ సమక్షంలో విచారణకు రాగా, సీబీఐ తరపున హాజరైన న్యాయవాది... రఘుగణేశ్ కోరికను పరిశీలించాల్సిన అవసరం లేదని వాదించారు. ఇరుతరపు వాదనల అనంతరం న్యాయమూర్తి తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఇప్పటికే న్యాయస్థానంలో 100పేజీల సాక్ష్యం అందుబాటులో ఉందని, అందువల్ల మళ్లీ క్రాస్ ఎగ్జామిన్ పేరుతో కేసు సాగదీయరాదని సూచించి, త్వరలోనే తీర్పు వెలువరించనున్నట్లు ప్రకటించారు.

విషవాయువు సోకి కార్మికుడి మృతి



స్పృహ కోల్పోయిన కార్మికుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మక్కాన్ జంక్షన్‌లో ఓపెన్ డ్రైనేజీ కాలువ ఉంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ డ్రైనేజీ పూడుకుపోయింది. డ్రైనేజీ శుభ్రం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులతో, ముత్తమండపం ప్రాంతానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మురుగన్ (48) కాలువలోకి దిగగా హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతనిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్సలు ఫలించక మృతిచెందాడు. కాలువ శుభ్రం చేస్తున్న సమయంలో విషవాయువు సోకి మురుగన్ మృతిచెందాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

ఎంత పెద్ద తప్పు చేశానో అప్పుడు గ్రహించా

● నెల్సన్ దిలీప్ కుమార్

'బ్లడీ బెగ్గర్' చిత్ర కథకు హీరోగా కవిన్‌ను వద్దని ఆరంభంలో చెప్పానని, కానీ, సినిమా షూటింగ్ పూర్తయి తొలికాపీ చూసిన తర్వాత కవిన్‌ను వద్దని చెప్పడం వల్ల ఎంత పెద్ద తప్పు చేశానో తాను గ్రహించానని చిత్ర నిర్మాత నెల్సన్ దిలీప్ కుమార్ అన్నారు. ఫిలమెంట్ ప్రొడక్షన్స్ పతాకంపై 'జైలర్' డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ నిర్మాతగా తెరకెక్కించిన చిత్రం 'బ్లడీ బెగ్గర్'. కవిన్ హీరో. శివబాలన్ ముత్తుకుమార్ దర్శకుడు. జెన్ మార్టిన్ సంగీతం. ఈ నెల 31న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి చెన్నైలో ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత నెల్సన్ మాట్లాడుతూ... 'స్టోరీ వినిపించినపుడు 'జైలర్' షూటింగు జరుగుతుంది. ఈ సినిమా హిట్ అయితేనే నిర్మాతగా సినిమా తీస్తానని శివబాలన్‌కు షరతు పెట్టాను. అందుకే 'జైలర్' మూవీ హిట్ కావాలని నాకేంటే బలంగా కోరుకున్నాడు. హీరోగా కవిన్ కావాలని కోరగా, నేను వద్దని కరాఖండిగా చెప్పి, ధనుష్, విజయ్‌సేతుపతి వంటి మరికొందరి పేర్లను సూచించాను. అయితే, ఈ చిత్రం తొలికాపీ చూసిన తర్వాత కవిన్ వద్దని చెప్పడం నేను పెద్ద తప్పు చేశానని గ్రహించా . ఇది ఒక థ్రిల్లర్ కోణంలో ఉన్నప్పటికీ డార్క్ కామెడీ ఎంటర్‌టైనర్. దీపావళికి శివకార్తికేయన్ 'అమరన్', జయం రవి 'బ్రదర్' వంటి చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటితో పాటు మా చిత్రాన్ని కూడా ప్రేక్షకులు, మీడియా ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు. హీరో కవిన్ మాట్లాడుతూ... 'ఒకరిపై మరొకరికి ఉన్న నమ్మకే ఈ చిత్రం తెరకెక్కడానికి ప్రధాన కారణం. నాకు ఇండస్ట్రీలో స్థానం కల్పించిన వ్యక్తి నెల్సన్. నా జీవితంలో మరిచిపోలేని చిత్రంగా ఉంటుంది. దర్శకుడుగా శివబాలన్‌కు, నిర్మాతగా నెల్సన్‌కు తొలి చిత్రం. చాలా సింపుల్ కథ. ప్రతి ఒక్కరికీ నచ్చే రీతిలో తెరకెక్కించారు. 'అమరన్', 'బ్రదర్', 'బ్లడీ బెగ్గర్' సినిమాలను చూసి దీపావళిని జరుపుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. దర్శకుడు శివబాలన్ మాట్లాడుతూ.. 'నేను రాసిన కథకు కవిన్ ప్రాణం పోశాడు. దర్శకుడుగా నెల్సన్ అనేక ప్రశ్నలు అడుగుతారు. నిర్మాతగా కూడా అలానే ఉంటారని భావించా. కానీ, నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఆయనకు ధన్యవాదాలు' అని అన్నారు.



'బ్లడీ బెగ్గర్' ప్రీరిలీజ్ ఈవెంట్ దృశ్యం

పెళ్లికి సిద్ధమైన కోలీవుడ్ హీరోయిన్!


రమ్య పాండియన్

కోలీవుడ్ హీరోయిన్ రమ్య పాండియన్ త్వరలోనే పెళ్లిపీటలెక్కనున్నారు. పంజాబ్‌కు చెందిన యోగా ట్రైనర్‌ను ఆమె వివాహమాడనున్నారు. వీరి వివాహం వచ్చే నెలలో రిషికేష్‌లో జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'జోకర్' సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రమ్య.. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించారు. 'కుక్ విత్ కోమాలి' అనే బుల్లితెర కార్యక్రమం ద్వారా అనేక మంది ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇపుడు నిశ్శబ్దంగా పెళ్లి పీటలెక్కేందుకు సిద్ధమయ్యారు. బెంగళూరులోని ఆధ్యాత్మిక గురువు రవి శంకర్‌కు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటరులో యోగా శిక్షణ పొందే సమయంలో అక్కడ ట్రైనర్‌గా పనిచేసే లోవెల్ ధవన్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో వీరిద్దరు పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటున్నారు. కాగా, లోవెల్ ధవన్ పంజాబ్ రాష్ట్రంలోని లుథియానాలో ఉన్న పబ్లిక్ లేబొరేటరీస్‌కు యజమాని. వీరిద్దరి వివాహం వచ్చే నెల 8న జరగనుందని, నవంబరు 15న చెన్నైలో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

జీవితంలో సమస్యలు వర్షాల్లాంటివి

● శివకార్తికేయన్

జీవితాల్లో వచ్చే సమస్యలు చెన్నై వర్షాల్లాంటివని, మనం సిద్ధంగా ఉన్నపుడు అవి రావని, సరదాగా ఉన్నపుడు ముంచెత్తుతాయని అలాంటి సమయంలో బయటపడేందుకు పోరాటం చేయకతప్పదని హీరో శివకార్తికేయన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన కొత్త చిత్రం 'అమరన్'. అగ్రనటుడు కమలహాసన్ నిర్మాతగా రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై వీరమరణం పొందిన భారత సైనికుడు, దివంగత మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించారు. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకుడు. సాయిపల్లవి హీరోయిన్. సంగీతం జీవీ ప్రకాష్ కుమార్ అందించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక శుక్రవారం రాత్రి చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా హీరో శివకార్తికేయన్ మాట్లాడుతూ... 'రెండేళ్ల క్రితం 'ప్రిన్స్' చిత్రం విడుదలై నిరుత్సాహానికి గురి చేసింది. అప్పుడు నిరాశలో కూరుకునిపోయా. ఓ రోజున హీరో అజిత్‌ను కలిసా. నా చెయ్యి పట్టుకుని చాలా మంది నీ ఎదుగుదలను చూసి అభద్రతాభావంతో ఉన్నారంటే నువ్వు పురోగమిస్తున్నావని అర్థం అని అన్నారు. ఆ మాటలు నాకు బూస్ట్‌లా పనిచేశాయి. మేజర్ ముకుంద్ కథను దర్శకుడు వివరించినపుడు భావోద్వేగానికి గురయ్యా. వంద రోజుల పాటు కశ్మీర్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాం. ఈ సినిమా క్లైమాక్స్ ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. ఓ టీవీ చానెల్‌లో పనిచేస్తున్నపుడు సాయిపల్లవిని తొలిసారి కలిశా. ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్'లో ఆమె నటనకు ఫిదా అయ్యా. ఫోన్ చేసి ప్రశంసించా. ఆమె వెంటనే 'థ్యాంక్యూ బ్రో' అని చెప్పింది. నన్ను అన్నా అని పిలిచినందుకు అపుడు చాలా ఫీలయ్యా. ఆమె గొప్ప నటి' అన్నారు. అతిథిగా హాజరైన దర్శకుడు లోకేష్ కనకరాజ్ మాట్లాడుతూ... ఈ సినిమా చూసి దేశమంతా గర్వపడుతుంది. కమల్ చూసి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు' అన్నారు. దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ... 'ముకుంద్ వంటి గొప్ప వ్యక్తుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. నేను సాయిపల్లవికి పెద్ద అభిమానిని. భవిష్యత్‌లో ఆమెతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నా' అన్నారు. హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ... 'ఈ సినిమా హీరోగా శివకార్తికేయన్ సరైన ఎంపిక' అని అన్నారు. అలాగే, చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ తదితరులు ప్రసంగించారు.


శివకార్తికేయన్ - సాయిపల్లవి


విద్యార్థులతో సాయిపల్లవి సెల్ఫీ

చిత్రజ్యోతి

కార్తీ సుబ్బరాజ్ దర్శకత్వంలో జయం రవి?

కార్తీ సుబ్బరాజ్ దర్శకత్వంలో హీరో జయం రవి నటించనున్నట్టు కోలీవుడ్ సమాచారం. ఈ విషయంపై సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. జయం రవి నటించిన తాజా చిత్రం 'బ్రదర్' దీపావళికి విడుదలవుతుంది. అలాగే, చేతిలో 'జెనీ', 'కాదలిక్క నేరమిల్లై' చిత్రాలు పూర్తి చేసిన తర్వాత దర్శకుడు గణేష్‌బాబు దర్శకత్వంలో మరో చిత్రంపై దృష్టి సారించారు. ఈ ప్రాజెక్టు డిసెంబరులో పట్టాలెక్కనుంది. మరోవైపు, కార్తీ సుబ్బరాజ్ - జయం రవి కాంబోలో రూపొందే ప్రాజెక్టుపై చర్చలు జరుగుతున్నట్టు కోలీవుడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. జయం రవికి పలు కథలు వినిపించగా, వాటిలో ఒక దాన్ని ఖరారు చేసి ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం.




వీపీసింగ్ విగ్రహం


అంబేద్కర్ విగ్రహం


అబ్దుల్ కలాం విగ్రహం


ఎగ్మూరు మ్యూజియం వద్ద గాంధీ విగ్రహం


వీరపాండ్యకట్ట బ్రహ్మన్న విగ్రహం


మెరీనాబీచ్‌లో నేతాజీ విగ్రహం


బీచ్ లైట్‌హౌస్ సమీపంలో కామరాజర్ విగ్రహం



SUNDAY SPECIAL

భావితరాలకు స్ఫూర్తి చిహ్నాలు

ఈ నేతల విగ్రహాలు

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేటి యువతకు స్ఫూర్తి కలిగించే దివంగత స్వాతంత్ర్య సమరయోధులు, మహా నాయకులు, ధీరవనితలు, మహా కవులు, జాతీయ నాయకుల విగ్రహాలు ఎన్నో ఉన్నాయి. ఈ విగ్రహాలన్నీ రోజూ లక్షలాదిమంది సంచరించే ప్రాంతాల్లో, స్మారక మండపాల్లో ఉండటం విశేషం. వీటిని రాష్ట్ర ప్రభుత్వం సంరక్షిస్తుండటం మరీ విశేషం. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడల్లా నేతల విగ్రహాలను ప్రతిష్ఠించడం ఆనవాయితీగా మారింది. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. అదే సమయంలో మానవాళికి తిరుక్కురళ్ అనే పంచమ వేదాన్ని అందించిన తిరువళ్లువర్‌కు మూడు సముద్రాలు కలిసే కన్నియాకుమారి త్రివేణి సంగమం వద్ద రూ.9.25 కోట్లతో 133 అడుగుల ఎత్తుతో 7 వేల టన్నుల బరువుతో నిలువెత్తు విగ్రహం ప్రతిష్ఠించారు. కరుణ బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ప్రభుత్వం కూడా భావితరాలకు దేశ చరిత్ర, రాష్ట్ర స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను తెలియజేసేలా ఎన్నో విగ్రహాలను ఏర్పాటు చేసింది. భారతీయులు గర్వించదగ్గ జాతీయగీతం రచించిన రవీంద్రనాథ్ ఠాగూర్, తన కవితలతో యువతను స్వాతంత్ర్య సంగ్రామం వైపు మళ్లించిన మహాకవి భారతియార్, అహింసా యుద్ధంతో తెల్లదొరలను తరిమికొట్టిన జాతిపిత గాంధీజీ, ఈస్ట్ ఇండియా కంపెనీతో పోటీగా స్వదేశీ నౌకావాణిజ్యం నెరపిన వావు చిదంబరనార్, సామాజిక న్యాయాన్ని దేశవ్యాప్తంగా ఎలుగెత్తి చాటిన మాజీ ప్రధాని వీపీసింగ్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, రాజ్యాంగ ధర్మాసనం రూపకర్త అంబేడ్కర్... ఇలా చరిత్రలను తెలిపేలా భావితరాలకు స్ఫూర్తిని కలిగించే ఎన్నో విగ్రహాలున్నాయి. యేళ్ల తరబడి నలుపు రంగులలో ఉన్న పాత విగ్రహాలను స్వర్ణ శిల్పాలు భ్రమించేలా వాటికి పసుపురంగు పెయింటింగ్‌తో తళతళా మెరిసేలా చేశారు. ఎగ్మూరు మ్యూజియం వద్ద 2022 ఆగస్టు 15న గాంధీ విగ్రహాన్ని, అదే యేడాది అక్టోబర్ 27న అంబేడ్కర్ స్మారక మండపం వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని, డిసెంబర్ 11న ఉత్తర ప్రదేశ్‌లోని కాశీ నగరంలో రూ.18లక్షలతో మహాకవి భారతియార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇదే రీతిలో 2023 జనవరి 28న నామక్కల్ జోడర్ పాళయంలో రూ.26.30లక్షలతో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లాల్ ఇలయ నాయకర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

గాంధీ మండపంలో..

గిండి గాంధీమండపంలో గతేడాది ఫిబ్రవరి 14న స్వాతంత్ర్య సమర యోధులు వీరపాండ్య కట్టబ్రహ్మన్న, మరుదు పాండ్య సహోదరుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇదే విధంగా కోయంబత్తూరు వా.వు.సి. ఉద్యానవనంలో రూ.40 లక్షలతో వా.వు. చిదంబరనార్ విగ్రహాన్ని, మైలాడుదురైలో రూ.15.97 లక్షలతో మహిళాభ్యుదయం కోసం పోరాడిన మూవలూరు రామామృతం, పుదుకోటలో రూ.9.84 లక్షలతో సంఘసంస్కర్త డాక్టర్ ముత్తులక్ష్మిరెడ్డికి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మదురైలో తమిళ సినీ నేపథ్య గాయకుడు టీఎం సౌందరరాజన్‌కు, చెన్నై రాణీ మేరీ కళాశాల ప్రాంగణంలో రవీంద్రనాథ్ ఠాగూర్ నిలువెత్తు విగ్రహాన్ని, అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నిలువెత్తు విగ్రహాన్ని, గతేడాది నవంబర్ 27న మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేసి సామాజిక న్యాయాన్ని నెలకొల్పిన మాజీ ప్రధాని వీపీ సింగ్‌కు నిలువెత్తు విగ్రహాన్ని స్టాలిన్ ఆవిష్కరించారు. రాణీమేరీ కళాశాల ప్రాంగణంలోనే జాతీయగీతం రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ నిలువెత్తు విగ్రహాన్ని కూడా నెలకొల్పారు. ఇక మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఓమండూరార్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంతంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో ఆవిష్కరింపజేశారు. ఇలా రాజధాని నగరం చెన్నైలోని ఈ నేతల విగ్రహాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు, ఇతర ప్రాంతాల్లోని విగ్రహాలను ఆయా పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల నిర్వాహకులు సంరక్షిస్తున్నారు.


కాశీలో భారతియార్ విగ్రహం


గిండీ గాంధీమండపం వద్ద వా.వు. చిదంబరనార్ విగ్రహం


మరుదుపాండ్య సోదరులు



ఒమండురార్ ఎస్టేట్‌లో మాజీ సీఎం కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు



మెరీనా బీచ్‌లో సెల్ఫీపాయింట్

నమ్మచెన్నై సెల్ఫీ స్పాట్..

మెరీనాబీచ్‌లో సుభాస్ చంద్రబోస్ విగ్రహం నుంచి లైట్‌హౌస్ వద్దనున్న కామరాజర్ విగ్రహం దాకా ఉన్న విగ్రహాలు కూడా చూడచక్కగా అధికారులు పసుపు రంగు పెయింట్ వేసి చక్కదిద్దారు. మెరీనా బీచ్ సర్వీసు రోడ్డులో నగరవాసులంతా వాకింగ్ చేస్తూ ఈ విగ్రహాలను చూస్తు వెళుతుంటారు. దారి మధ్యలో 'నమ్మచెన్నై' అనే తమిళ, ఆంగ్ల అక్షరాలతో రూపొందించిన సెల్ఫీస్పాట్‌ను చూడగానే దాని వద్ద నిలిచి సెల్ఫీలు కూడా తీసుకుంటున్నారు. స్టాలిన్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ 10 స్మారక మండపాలు, 36 విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఏది ఏమైనప్పటికీ ఈ విగ్రహాలను చూడగానే వారి త్యాగాలు, కవితలు, సామాజిక సేవలు గుర్తుకు వస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

వైభవంగా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో కుంభాభిషేకం


బంగారు అడిగళార్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అన్బళగన్, సెంథిల్‌కుమార్

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్ మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో ఉన్న గురు పీఠానికి శనివారం ఉదయం వైభవంగా నిర్వహించిన కుంభాభిషేకంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో ఈ నెల 16న అమ్మవారి అభిషేక అలంకరణ పూజలతో బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభమైంది. మూడో రోజు కార్యక్రమంలో శనివారం తెల్లవారుజామున గర్భగుడిలో కొలువుదీరిన అమ్మవారికి విశేష పూజలు, రెండో జాము పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బంగారు అడిగళార్ విగ్రహం ప్రతిష్ఠించిన సన్నిధి గోపుర కలశానికి ఆధ్యాత్మిక విభాగ ఉపాధ్యక్షుడు అన్బళగన్, సెంథిల్‌కుమార్ పుణ్యజలాలు సంప్రోక్షించి కుంభాభిషేకం చేశారు. అనంతరం పీఠం అధ్యక్షురాలు లక్ష్మి బంగారు అడిగళార్.. అడిగళార్ విగ్రహానికి అభిషేకం, మహా దీపారాధన పూజలు నిర్వహించారు. కరూర్, రామనాథపురం, పుదుకోట, శివగంగ జిల్లాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వేలూరు జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.మహాలింగంను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న తమిళనాడు టెక్నికల్ విద్యా శాఖ రాష్ట్ర అధ్యక్షుడు జనార్దనన్ తదితరులు

పొలం బాట



వాకాడు మండలం నిడిగుర్తి సమీపంలోని పొలాల్లోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. వాకాడు డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం మల్లాం నుంచి మూల పడవ గ్రామానికి బయలుదేరింది. నిడిగుర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ప్రయాణికులు ఉలికిపాటుకు గురయ్యారు. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపు తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఎరక్కపోయి వచ్చాను..ఇరుక్కుపోయాను



నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌కు వెళ్లే రహదారిలో కల్వర్టుకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేసే క్రమంలో పరిమితికి మించి కల్వర్టు ఎత్తు పెంచారు. దీంతో సెజ్‌లోకి వచ్చే భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పైగా వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. ఈ క్రమంలో శనివారం ఒక భారీ వాహనం ఆ ప్రాంతంలో ఇరుక్కుపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి వాహనదారులు, ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండాల్సి వచ్చింది.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

జగనన్న కాలనీ జలమయం

శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీ శనివారం జలమయమైంది. వేకువజామున 4 నుంచి 5 గంటల వరకు కురిసిన వర్షానికి పనస కాలువ నుంచి నీరు పొంగి జగనన్న కాలనీ వైపు ప్రవహించాయి. కాలనీలోని ఇళ్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అక్కడ నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





కొండ శిఖరంపై



తటాకాల్లో ఈదులాడుతూ





నీటి మడుగు అడుగున దేవతా మూర్తితో - జలపాతం కింద



ఇక్కడే నివాసం

వనవాసి

ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో, తల్లిదండ్రులెవరో తెలీదు. ఎలా వచ్చాడోగానీ పసి వయసు నుంచీ తిరుమలలో కనిపిస్తున్నాడు. ప్రసాదాలు తింటాడు.. బండలమీద పడుకుంటాడు.. ఒంటిమీద ఇంత గుడ్డ చుట్టుకుంటాడు.. ఉత్సవాల సమయాల్లో దివిటీలు పట్టుకునేవాళ్ల పక్కన చేరి తనూ అందుకుంటాడు. మాడవీధుల్లో తిరుగుతాడు. పేరు జైబాలాజీ. ఆ పేరును ఆయనే పెట్టుకున్నాడు. ఇప్పుడతని వయసు 50 ఏళ్లు ఉండచ్చు. తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనం సీమపంలో కృష్ణతేజ విశ్రాంతి భవనం వెనుకవైపు దట్టమైన చెట్ల నడుమ అతని నివాసం. పేర్చిన బండరాళ్ల మీద రేకు పైకప్పు. కరెంటుతో పనిలేదు. వంట లేదు. శ్రీనివాసుడి ఆరాధన తప్ప మరో ధ్యాస లేదు. చెట్టూ పుట్టా, పిట్టా పురుగూ, వాగూ వంకా.. తిరుమల అడవుల్లో ఆయనకు తెలియనివేవీ లేవు. భవిష్యత్తు గురించిన బెంగలేదు.. భయం అంటే ఏమిటో తెలీదు.. ఈ శేషాచలజీవికి. అడవిలో ఉంటే కాయాగసరూ తింటాడు. తిరుమలలో ఉంటే అన్నప్రసాదాలు తింటాడు. జైబాలాజీకి తెలియని తీర్థం, ఆయన ఎక్కని శిఖరం, దిగి తిరగని లోయ.. తిరుమల కొండల్లో లేవు. తిరుమల తీర్థాలకు ట్రెక్కింగ్ వెళ్లే బృందాలకు తోవ చూపుతాడు. వాళ్లతో కలిసి నడుస్తాడు. జలపాతాల కింద తడుస్తాడు. ఎత్తయిన బండలమీద నుంచి తటాకాల లోతుల్లోకి దూకి ఈదులాడుతాడు. తీర్థాల విశేషాలను వివరిస్తాడు. పిల్లనగ్రోవి ఊదుతూ ఏ పచ్చని చెట్టు కిందో ఉండిపోతాడు. తిరుమల అడవుల ఆనుపానులు తెలిసిన జైబాలాజీ కొంతకాలంగా యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాడు. అడవిలో ఆయన జీవనశైలిని చిత్రించి కొందరు వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. యూట్యూబ్ స్టార్‌గా మారిపోయిన ఈ అడవిబిడ్డ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కుకు 'అధికార' చిక్కులు

- అధినేత హెచ్చరించినా దారికి రాని 'తమ్ముళ్లు'
- జిల్లాలో పలుచోట్ల షాపులు పెట్టనివ్వని వైనం
- లక్కులో దక్కినా తలపట్టుకుంటున్న యజమానులు

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల విషయంలో జోక్యం చేసుకుని చెడ్డపేరు తేవద్దంటూ సీఎం చంద్రబాబు గట్టిగా వార్నింగ్ ఇచ్చినా జిల్లాలో కొన్నిచోట్ల కొందరు కూటమి నాయకుల తీరు మారినట్లు కనిపించడంలేదు. ఆయన హెచ్చరిక జారీ చేసి 24 గంటలు తిరక్కుండానే కొందరు తెలుగు తమ్ముళ్లు గాలికొదిలేసి తమదైన పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అంతా తమ కనుసన్నల్లో జరగాల్సిందేనంటున్న వైనాలు జిల్లాలో బయటపడుతూనే ఉన్నాయి.

- ఏర్పేడు మండలానికి చెందిన 82వ నంబరు మద్యం షాపును పంగూరుకు చెందిన కిరణ్ కుమార్‌నాయుడుకు లాటరీలో దక్కింది. ఏ పార్టీకీ చెందని ఇతడు ఆమందూరు పంచాయతీ పరిధిలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఓ గది అద్దెకు తీసుకున్నారు. శనివారం మద్యం స్టాక్ తెచ్చుకున్నారు. అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధి, పార్టీ నాయకుడు తమ అనుచరులతో కలసి ఇతడ్ని అడ్డుకున్నారు. గంటపాటు గొడవ జరిగింది. నిస్సహాయుడైన యజమాని షాపు తెరవలేక మద్యం స్టాక్‌ను వెనక్కు తీసుకెళ్ళిపోయాడు. షాపు ఏర్పాటు వల్ల మహిళలకు, విద్యార్థినులకు ఇబ్బంది అంటూ ఈ నాయకులు పైకి చెబుతున్నా అడ్డుకున్న స్థానిక ప్రజాప్రతినిధి మద్యం సిండికేట్ కీలక సభ్యుడని సమాచారం. మండల కేంద్రంలో షాపు ఏర్పాటు యత్నాల్లో ఉన్న తనకు ఆమందూరు పరిధిలో షాపు పెడితే వ్యాపారం తగ్గుతుందనే అడ్డుపడ్డారని తెలిసింది



ఏర్పేడులో షాపును స్థానికులు అడ్డుకోవడంతో మద్యం బాక్సులను వాహనంలో తరలిస్తున్న నిర్వాహకుడు

ఐదు షాపులు పెండింగ్

తిరుపతి రూరల్ మండలంలో 12 షాపులు కేటాయించగా ఇంకా ఏడు ఏర్పాటు కాలేదు. తిరుచానూరు సమీపంలో స్థానిక ప్రజాప్రతినిధి సోదరుడికి లాటరీలో రెండు షాపులు వచ్చాయి. వాటిని ఇచ్చేయాలంటూ కూటమి పార్టీల నేతలు, మద్యం సిండికేట్ సభ్యులు అతడిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. తాము ఇచ్చినంత తీసుకుని వదిలిపెట్టేయాలని డిమాండ్ చేశారు. వినకపోవడంతో అతడి సోదరుడు, స్థానిక ప్రజాప్రతినిధి గతంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. ఆ దిశగా చర్యలకు కూడా దిగడంతో గత్యంతరం లేక రెండు షాపులూ సిండికేట్‌కే అప్పగించినట్టు సమాచారం.

బాలాయపల్లిలోనూ అదే పరిస్థితి

బాలాయపల్లిలో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తి పరిస్థితి కూడా డక్కిలి వ్యక్తి తరహాలోనే ఉందని టీడీపీ వర్గాల్లోనే ప్రచారమవుతోంది. షాపు తమకే ఇచ్చేయాలని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు భీష్మించుకోవడంతో ఇంతవరకూ లైసెన్సుదారు షాపు ఏర్పాటు చేయలేదని భోగట్టా..

గూడూరులో సెటిల్‌మెంట్!

గూడూరు పట్టణానికి ప్రభుత్వం పది షాపులు కేటాయించింది.అందులో ఇప్పటి వరకూ రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. ఎనిమిది పెండింగులో వున్నాయి. ఏ షాపులో ఎవరెవరికి ఎంతెంత వాటాలు ఇవ్వాలనేది అక్కడి ముఖ్యనేత వద్ద ప్రస్తుతం సెటిల్‌మెంట్ నడుస్తోందని సమాచారం.

డక్కిలి షాపులో వాటాకు పట్టు

డక్కిలి మండల కేంద్రంలో రెండు షాపులుండగా ఒకటి రాజకీయాలకు సంబంధం లేని తటస్త వ్యక్తికి దక్కింది. అతను షాపు ఏర్పాటు ప్రయత్నాల్లో ఉండగా అధికార పార్టీ నేతలిద్దరు షాపును తమకు ఇచ్చేయాలని పట్టుబట్టారు. యజమాని ఎదురు ప్రశ్నించడంతో పంచాయతీ ముఖ్యనేత వద్దకు వెళ్ళిందని తెలిసింది. తమ వాళ్ళు గత ఐదేళ్లలో బాగా నష్టపోయారని, కాబట్టి వారికి 40 శాతం వాటా ఇవ్వాలని పంచాయతీలో తేల్చి చెప్పారని సమాచారం. దీంతో షాపు యజమాని మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది.

రేణిగుంటలో నేతల జోరు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో ఆరు లాటరీలో టీడీపీ అనుకూలురు దక్కించుకున్నారు. మిగిలిన నాలుగు షాపులూ వైసీపీ అనుకూలురకు దక్కాయి. ఆ నాలుగూ ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వాటిని ఏర్పాటు చేయకుండా ముఖ్యనేత పేరు చెప్పి అనుచరులు అడ్డుకుంటున్నారని తెలిసింది. షాపులు ఎలా నడుపుతారో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం.

ప్రారంభం కానిది 11 షాపులే

జిల్లాలో ఇప్పటి వరకూ 11 మద్యం దుకాణాలు మాత్రమే ప్రారంభం కాలేదని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అధికార పార్టీ నేతలు గానీ సిండికేట్ పేరిట ఇతరులు గానీ లైసెన్సుదారులను అడ్డుకుంటున్నట్టు, బెదిరిస్తున్నట్టు తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్,చంద్రగిరి, శ్రీకాళహస్తిలలో మాత్రమే 11షాపులు ఏర్పాటు కావాల్సి ఉందంటున్నారు. అవి త్వరలోనే ప్రారంభమవుతాయంటున్నారు.





ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీవో కిరణ్మయి - చికిత్స పొందుతున్న కార్మికులు

ఆటోను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి
- ఏడుగురు కార్మికులకు గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారి కండ్రిగ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఉల్లా మునిరాజా(33) మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురి కార్మికులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... దొరవారిసత్రం మండలం ఏకొల్లు, పూలతోట గ్రామాల నుంచి తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలో ఉన్న ఓ పరిశ్రమలో పనిచేసే పది మంది కార్మికులు శనివారం విధులకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారికండ్రిగ వద్ద వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మునిరాజా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏకొల్లుకు చెందిన షకీనా, నీరజ, నిర్మల, ఈశ్వరి, పి.ఉదయ భాస్కర్, నేలపట్టుకు చెందిన పి.దేవి, విజయలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ మురళీ కృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన కార్మికులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆర్డీవో కిరణ్మయి ప్రభుత్వాస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆటో డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో మహిళలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. కంపెనీలు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో కార్మికులు ఆటోల్లో వెళ్లి రావాల్సి వస్తోంది. ఈ విషయాన్ని క్షతగాత్రులు ఆర్డీవో కిరణ్మయి దృష్టి తీసుకెళ్లారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా చూస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.



మృతి చెందిన మునిరాజా(ఫైల్‌ఫొటో)

నాలుగు రోజుల్లో రూ.49.38 కోట్ల మద్యం విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగు రోజుల్లో రూ.49.38కోట్ల విక్రయాలు జరిగాయి. 227 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయగా ఇప్పటివరకు 218 ప్రారంభమయ్యాయి. ఇందులో తిరుపతి డివిజన్ పరిధిలో 125, గూడూరు డివిజన్ పరిధిలోని 93ఉన్నాయి. శనివారం వరకు 16,890 కేసుల బీర్లు, 9,179 కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.49.38 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలోని మద్యం దుకాణాలు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎమ్మార్పీకి విక్రయించకపోయినా, సమయపాలన పాటించకపోయినా చర్యలు తప్పవని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. తిరిగి శనివారం వేకువజామున గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. తొట్టంబేడు మండలంలో 79.మి.మీ., బుచ్చినాయుడుకండ్రిగ 72.4, శ్రీకాళహస్తి 68.8, పిచ్చాటూరు 50.4, పెళ్లకూరు 50.2, దొరవారిసత్రం 48.2, నాగలాపురం 45.4, చిల్లకూరు 39.2, గూడూరు 37.4, ఏర్పేడు 34.2, సత్యవేడు 32.6, సూళ్లూరుపేట 32.4, రేణిగుంట 27.2, పాకాల 25.2, బాలాయపల్లి 24.8మి.మీ వర్షపాతం నమోదైంది.

స్కూల్‌వ్యాన్ బోల్తా ..పిల్లలు క్షేమం

కేవీబీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూల్ వ్యాను అదుపుతప్పి బోల్తాపడింది. అయితే పిల్లలందరూ సురక్షితంగా బయటపడ్డారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాను శనివారం సాయంత్రం విద్యార్థులను ఇంటివద్ద దించడానికి కొండల్లో ఆదవరానికి బయలుదేరింది. ఎస్‌ఎల్‌పురం వద్ద ఎదురుగా కారుకు రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను కాస్త పక్కకు తిప్పారు. దీంతో వ్యాను మట్టిలో దిగి పక్కకు ఒరిగిపోయింది. వ్యానులో ఏడుగురు పిల్లలు ఉన్నారు. వ్యాను ఒరుగుతుండగానే అందరూ దిగేశారు. ఎవరికీ గాయాలు కాలేదు. కాగా సింగిల్ రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డును మరింత విస్తరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బోల్తా పడిన స్కూల్‌వ్యాన్



భక్తులతో కిటకిటలాడిన అలిపిరి



తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళులు ఎంతో పవిత్రంగా బావించే పెరటాసి మాసం ఐదో శనివారం కావడంతో తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులతో అలిపిరి కిటకిటలాడింది. అలిపిరి పాదాల మండపం నుంచి గాలిగోపురం వరకు భక్తులు పోటెత్తారు. మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.



సఫాయి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగుల సేవలో తరిస్తున్న సఫాయి కర్మచారి(పారిశుధ్య కార్మికులు)లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సక్రమంగా వర్తింపజేయాలని, వారికి ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ వైద్యాధికారులకు ఆదేశించారు. రుయాస్పత్రి, స్విమ్స్‌లను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రుయాస్పత్రిలో పారిశుధ్య కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు చెల్లించడంలేదని, డ్యూటీలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని కార్మికులు తెలిపారు. వెంటనే ఆయన కాంట్రాక్టు నిర్వాహకులను పిలిచి మందలించారు. బిల్లులు రాకపోవడం వల్ల జీతాలు ఇవ్వడం కొంత ఆలస్యమైందని ఏ-1 కాంట్రాక్టు నిర్వాహకుడు రవికుమార్ చెప్పగా వెంటనే ఫోన్లో డీఎంఈ నరసింహులుతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్మికులకు పది రోజుల్లో జీతాలు చెల్లించాలని, నిబంధనల మేరకు వారికి సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టు నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం స్విమ్స్‌కు చేరుకుని స్విమ్స్ అధికారులు, సఫాయి కార్మికులు, కర్మచారీ సంఘం నేతలతో సమీక్షించారు. అక్కడ సఫాయి కార్మికులకు అందిస్తున్న సదుపాయాలను, జీతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్నీ సకాలంలో అందుతున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన కార్యాలయ నంబరు 011-24648924కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రభు, ఏఆర్‌ఎంవో హరికృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్, ఆర్‌ఎంవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ వెంకటేశన్

నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలి

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ తెలిపారు. శనివారం తిరుపతి కార్పొరేషన్‌లో సఫాయి కార్మికుల సమస్యలపై కమిషనర్ మౌర్యతో కలసి సమీక్షించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మస్టర్ గదులు తక్కువగా ఉన్నాయని, మహిళల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.